
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అల్లూరి సీతారామరాజు

జిల్లా వార్తలు

ఆదివారం 18 ఫిబ్రవరి 2024

చలి తీవ్రతరం.. వణుకుతున్న గిరిజనం

» అరకులో 8.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత... దట్టంగా పొగ మంచు



చింతపల్లి సమీపంలో దట్టంగా కురుస్తున్న మంచు

- 6లో

ఆర్థిక రాజధానిగా విశాఖ

ఐటీ కేంద్రంగా, మెడికల్ డివైస్ తయారీ హబ్‌గా తీర్చిదిద్దుతాం

ఫ్లై ఓవర్లు, అండర్ బ్రిడ్జిలు నిర్మించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తాం



కృష్ణరాయపురం సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న నారా లోకేశ్

చిట్టివలస సభకు హాజరైన టీడీపీ, జనసేన శ్రేణులు. (పక్కన) మాట్లాడుతున్న నారా లోకేశ్

- ఏటా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీల భర్తీ
- ఉద్యోగం వచ్చేంత వరకూ నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తాం
- భీమిలితో నాకు ప్రత్యేక అనుబంధం
- గత ఎన్నికల్లో ఇక్కడ నుంచి పోటీ చేయాలని చంద్రబాబునాయుడు చెప్పారు
- చిట్టివలస శంఖారావం సభలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్
- మోస్ట్ హ్యాపినింగ్ సిటీని విషాద నగరంగా మార్చిన ఘనత జగన్‌దేనంటూ ధ్వజం

విశాఖపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి):

విశాఖ నగరాన్ని ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేస్తామని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. గతంలో తాను ఐటీ శాఖా మంత్రిగా ఉన్నప్పుడు నగరానికి అనేక పరిశ్రమలు తీసుకువచ్చానని గుర్తుచేశారు. శనివారం సాయంత్రం భీమిలి నియోజకవర్గ పరిధిలోని చిట్టివలస ఫుట్‌బాల్ మైదానంలో నిర్వహించిన శంఖారావం సభకు హాజరైన ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.

మోస్ట్ హ్యాపినింగ్ సిటీగా ఒకప్పుడు పేరుగాంచిన విశాఖను జగన్‌రెడ్డి విషాద నగరంగా మార్చేశాడన్నారు. అభివృద్ధిలో అంతర్జాతీయ ఖ్యాతిని ఒకప్పుడు తెస్తే...ఇప్పుడు ఇండియాకు గంజాయి క్యాపిటల్‌గా మార్చేశాడన్నారు. సొంత ఎంపీ కుటుంబ సభ్యులనే కిడ్నాప్ చేస్తే సాధారణ ప్రజల పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవాలన్నారు. విశాఖకు ఒక్క పరిశ్రమను తీసుకురాకపోయినా.. రుషికొండకు గుండు కొట్టి ... మిగతా 6వ పేజీలో

ఉత్తరాంధ్రకు పట్టిన దరిద్రం జగన్

- ఈ ప్రాంతాన్ని దోచుకునేందుకు సాయిరెడ్డి, సుబ్బారెడ్డి, బొత్సకు లైసెన్స్ ఇచ్చారు
- ఆయనపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి
- అవసరమైతే విశాఖ ఉక్కును రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది
- అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో టిడ్కో ఇళ్లు
- టీడీపీ, జనసేన కేడర్ మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు
- ఈ విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ.. దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి
- కృష్ణరాయపురం సభలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి):

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనపై ఉత్తరాంధ్ర ప్రజలు తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. వైసీపీ నాలుగున్నరేళ్ల పాలనపై ఉత్తరాంధ్ర ప్రజలు గర్జిస్తున్నారన్నారు. పోరాటాల పురిటిగడ్డ ఉత్తరాంధ్ర అని పేర్కొంటూ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకూ ఇక్కడ ప్రజలతో జగన్ ఆటాడుకున్నారని, ఆయనతో ప్రజలు ఫుట్‌బాల్ ఆడే సమయం ఆసన్నమైందని వ్యాఖ్యానించారు. శనివారం మధ్యాహ్నం విశాఖ జిల్లా ... మిగతా 6వ పేజీలో

నేడు జనసేన అధినేత రాక

నాయకులు, నియోజకవర్గ సమన్వయకర్తలతో భేటీ

- ఒక్కొక్కరితో విడివిడిగా మాట్లాడతారని సమాచారం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)


జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదివారం విశాఖపట్నం వస్తున్నారు. ఆయన హైదరాబాద్ నుంచి మధ్యాహ్నం మూడు గంటలకు ప్రత్యేక విమానంలో నగరానికి చేరుకుని నోవాటెల్ హోటల్‌లో బస చేస్తారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలతో సమావేశం అవుతారు. అందరితో ఒకేసారి కాకుండా ఒక్కొక్కరితో విడివిడిగా మాట్లాడతారని సమాచారం.

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా (విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి)లో మూడు లోక్‌సభ, 15 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. రాబోయే ఎన్నికల్లో జనసేన తరఫున పోటీ చేసేందుకు చాలామంది ఉవ్విళ్లూరుతున్నారు. ఇటీవల కాలంలో సీనియర్ నాయకులు చాలామంది చేరారు. సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ ఇటీవల పార్టీలో చేరారు. ఎటువంటి బాధ్యత ఇచ్చినా పనిచేస్తానని ప్రకటించారు. విశాఖ రూరల్ జిల్లా అధ్యక్షునిగా పంచకర్ల రమేశ్‌బాబు ఉన్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అనుభవం ఉంది. విశాఖ సిటీ అధ్యక్షునిగా ఇటీవలె ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ నియమితులయ్యారు. ఎమ్మెల్యేగా పోటీ చేయాలని ఆయన భావిస్తున్నారు. ఇంకా శివశంకర్, బొలిశెట్టి సత్య, కోన తాతారావు వంటి నేతలు వున్నారు. అలాగే సుందరపు విజయకుమార్ (ఎలమంచిలి), పసుపులేటి ఉషాకిరణ్ (ఉత్తరం), పంచకర్ల సందీప్ (భీమిలి) వంటివారు నియోజకవర్గ సమన్వయకర్తలుగా ఉన్నారు. సామాజిక వర్గాల బలం, సీనియారిటీ...ఇలా అనేక అంశాలను పరిగణనలోకి తీసుకొని అవకాశం కల్పించాలని పార్టీ అధినేత ఆలోచన. రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన మధ్య పొత్తు కుదిరింది. బీజేపీ కూడా రేపో మాపో కూటమిలో చేరనున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఎవరికి ఎన్ని సీట్లు, ఎక్కడ అనేది ఇంకా ఖరారు కాలేదు. ఈ నేపథ్యంలో పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ విశాఖపట్నం వస్తున్నారు. టికెట్లు ఆశిస్తున్న వారితో పాటు నియోజకవర్గ సమన్వయకర్తలను నోవాటెల్ హోటల్‌కు రావాలని పార్టీ కార్యాలయం నుంచి పిలుపు వచ్చింది. ఎంతమందికి పోటీ చేసే అవకాశం వస్తుంది?, రాని వారు ఏమి చేయాలి?, భవిష్యత్తులో వారికి లభించే ప్రాధాన్యం ఏమిటి?, ఈ కీలక సమయంలో పొత్తు పెట్టుకునే పార్టీలతో సమన్వయం చేయాల్సిన ఆవశ్యకత వంటి విషయాలను పవన్‌కల్యాణ్ వివరిస్తారని తెలుస్తోంది.

మహిళల భద్రతకు సరికొత్త పరికరం

చింతపల్లి జడ్పీ హైస్కూల్ బాలికలు వినూత్న ప్రయోగం

- ఉమెన్ సేఫ్టీ బ్యాగ్ పరికరం తయారీ
- విడిభాగాల కోసం రూ.2 వేలు మాత్రమే ఖర్చు
- ఒక్క బటన్ నొక్కితే రిజిస్టర్డ్ మొబైల్ ఫోన్లకు అలెర్ట్ మెసేజ్
- చిత్రంతో కూడిన లొకేషన్ లింక్
- ఆండ్రాయిడ్ ఫోన్, ఇంటర్నెట్‌తో పనిలేదు
- సెల్ టవర్ సిగ్నల్స్ ఉంటే చాలు



విద్యార్థినులు రూపొందించిన ఉమెన్ సేఫ్టీ బ్యాగ్ పరికరం

- జిలాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రథమ స్థానం
- రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపిక



ఉమెన్ సేఫ్టీ బ్యాగ్ పరికరం పనితీరును వివరిస్తున్న విద్యార్థినులు

చింతపల్లి, ఫిబ్రవరి 17: మహిళల భద్రత కోసం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు సరికొత్త పరికరాన్ని రూపొందించారు. ఒకే ఒక్క బటన్ నొక్కితే.. రిజిస్టర్ అయిన మొబైల్ ఫోన్లకు అలెర్ట్ మెసేజ్‌తో పాటు చిత్రంతో కూడిన లొకేషన్ లింక్ క్షణాల్లో చేరుతుంది. చిన్నపాటి ఈ పరికరాన్ని హ్యాండ్ బ్యాగ్‌లో పెట్టుకుని వెంట తీసుకెళ్లవచ్చని విద్యార్థినులు చెబుతున్నారు. ఈ నెల 15వ తేదీన అనకాపల్లిలో నిర్వహించిన ఉమ్మడి విశాఖ జిల్లాస్థాయి 'ఇన్‌స్పైర్ అవార్డు-మనక్' వైజ్ఞానిక ప్రదర్శనలో చింతపల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థినులు ప్రదర్శించిన ప్రయోగానికి ప్రథమ స్థానం లభించింది. ఈ నెల 25న చిత్తూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఈ ప్రాజెక్టు ఎంపికైంది.

చింతపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థినులు సాగిన భువన శృతి, అంజూర జ్యోత్స్నలు.. ఫిజిక్స్, బయాలజీ ఉపాధ్యాయులు జి.దాసు, జి.నాగేశ్వరరావుల సహకారంతో మహిళా భద్రతకు ఒక పరికరాన్ని రూపొందించాలని భావించారు. ఇందుకు ... మిగతా 6వ పేజీలో

మహిళలకు ఎంతో ఉపయుక్తం



ఉమెన్ సేఫ్టీ బ్యాగ్ పరికరం మహిళలకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. అగంతకులు ఎవరైనా మహిళలపై దాడి చేస్తే చిన్నపాటి బటన్‌ను ఒకసారి ప్రెస్ చేస్తే చాలు. ముందుగా పరికరంలో రిజిస్టర్‌చేసిన మొబైల్ నంబర్లకు అలెర్ట్ మెసేజ్, లొకేషన్ లింక్ వెళుతుంది. ఈ పరికరం పనిచేసేందుకు బ్యాటరీ చార్జింగ్, సెల్ సిగ్నల్స్ ఉంటే సరిపోతుంది. ఆండ్రాయిడ్ ఫోన్, ప్రత్యేక యాప్ అవసరంలేదు. ఈ పరికరం తయారీకి రూ.2 వేలు ఖర్చు అవుతుంది.

- సాగిన భువన శృతి, పదో తరగతి



ఏజెన్సీలో పని చేయడం అదృష్టంగా భావించాలి

- వీడ్కోలు సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్..

గిరిజన ప్రాంతంలో పని చేయడం అదృష్టంగా భావించి సేవలందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లాకు బదిలీ అయిన సందర్భంగా అధికారులు, ఉద్యోగులు శనివారం ఆయనకు కలెక్టరేట్‌లో వీడ్కోలు సత్కార సభ నిర్వహించారు. విధి నిర్వహణలో నిజాయితీ, పారదర్శకతలే ప్రధానమని, గిరిజనులతో స్నేహ పూర్వకంగా మాట్లాడుతూ వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని ఉద్యోగులకు సూచించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో కలెక్టర్‌గా తొలి పోస్టింగ్‌అని, ఇక్కడ పని చేసిన అనుభవాన్ని ఎప్పటికీ మర్చిపోనని సుమిత్ కుమార్ అన్నారు. అంతకుముందు తలారిసింగి కూడలి నుంచి కలెక్టరేట్ వరకు ఆయనపై పూలు చల్లుతూ, థింసా నృత్యాలు, మేళతాళాలతో ఊరేగించారు. - 6లో

సుమిత్‌కుమార్‌కు జ్ఞాపికను అందిస్తున్న జేసీ భావన. చిత్రంలో పీవో అభిషేక్, సబ్‌కలెకర్ ధాత్రిరెడ్డి, చింతపల్లి ఏఎస్పీ శివకిశోర్, తదితరులు

డీఎస్సీలో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం

గిరిజన సలహా మండలి తీర్మానానికి విరుద్ధంగా నోటిఫికేషన్

- ఏజెన్సీ ప్రాంతాల్లో 500 పోస్టులు... గిరిజనులకు దక్కేది 40 మాత్రమే!
- గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స



సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు అప్పలనర్స

పాడేరురూరల్, ఫిబ్రవరి 17:

ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వ ఉద్యోగాల్లో గిరిజనులకు శత శాతం రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించాలని గిరిజన సలహా మండలిలో తీర్మానం చేసిన రాష్ట్ర ప్రభుత్వం, దానికి విరుద్ధంగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయడం దారుణమని ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స మండిపడ్డారు. శనివారం ఇక్కడ నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, రిజర్వేషన్లకు సంబంధించి జీవో నంబరు-3ను సుప్రీం కోర్టు గతంలో రద్దు చేసిందని, దీనిపై పునఃపరిశీలన చేయాలని దాఖలైన పిటిషన్ విచారణలో వుందని, అయితే వైసీపీ ప్రభుత్వం ఆదివాసీలకు అన్యాయం చేసేలా ఉద్యోగాల భర్తీ చేపడుతున్నదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన డీఎస్సీలో 6,100 పోస్టులలో ఎస్టీలకు సంబంధించి 1,023 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. వీటిలో సుమారు 500 పోస్టులు ఏజెన్సీ ప్రాంతాల్లో వున్నాయని ప్రభుత్వం పేర్కొన్నదని, కానీ ఆదివాసీలకు రోస్టర్ పాయింట్‌ల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 40 పోస్టులు మాత్రమే కేటాయించారన్నారు. గిరిజన గురుకుల సొసైటీల్లో ఖాళీ పోస్టులను నిబంధనల ప్రకారం సొసైటీ నోటిఫికేషన్ ద్వారా మాత్రమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన గురుకులాల్లో ఇప్పటికే వందలాది మంది తాత్కాలిక ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారని, వారిని రెగ్యులర్ చేయకుండా రోస్టర్ పాయింట్‌ల పేరుతో రోడ్డున పడేయడానికి ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరించిదని ఆరోపించారు. గిరిజన ఎమ్మెల్యేలు, ఎంపీల చేతకానితనం వల్లే ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదన్నారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కొర్రా కార్తీక్, కార్యదర్శి కొర్రా జీవన్‌కుమార్, సింహాద్రి పాల్గొన్నారు.

జీవో నంబర్-3 పునరుద్ధరణపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు



మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

అరకులోయ, ఫిబ్రవరి 17: సుప్రీం కోర్టు గతంలో రద్దు చేసిన జీవో నంబరు-3 పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయకపోవడం వల్ల గిరిజన నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు.. శనివారం ఇక్కడ విలేకర్లతో మాట్లాడుతూ, జీవో నంబరు-3 అమల్లో వుండి వుంటే.. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన డీఎస్సీలో అల్లూరి సీతారామరాజు జిల్లాకు కేటాయించిన మొత్తం 153 పోస్టులూ గిరిజన అభ్యర్థులకే దక్కేవని అన్నారు. జీవో నంబరు-3 అమల్లో లేకపోవడంతో జిల్లా మొత్తం మీద తొమ్మిది పోస్టులు మాత్రమే ఆదివాసీలకు దక్కనున్నాయని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన ప్రాంతాల్లో గిరిజన సంక్షేమ శాఖ నోటిఫై చేసిన పోస్టులు 506 వుండగా, వీటిల్లో ఆదివాసీలకు దక్కేది 30 పోస్టులేనని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ ఉద్యోగులపై ప్రభుత్వం కక్ష సాధింపు

- విజయవాడ వెళ్లకుండా పోలీసులతో నోటీసులు
- సంఘం జిల్లా అధ్యక్షుడు గృహనిర్బంధం



పాడేరులో సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఈశ్వరరావును గృహ నిర్బంధం చేసిన పోలీసులు

పాడేరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఉద్యమిస్తున్న సీపీఎస్ ఉద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగుతోంది. సీపీఎస్‌ను రద్దు చేయాలని ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరుతూ సీపీఎస్ ఉద్యోగుల సంఘం ఆదివారం చలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. అయితే ఈ కార్యక్రమం జరగకుండా చూడాలన్న దురుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ ఉద్యోగుల సంఘం నేతలు ఊళ్ల నుంచి కదలకుండా పోలీసులతో ఎక్కడిక్కడ నిఘా పెట్టించింది. పాడేరులో వున్న సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.ఈశ్వరరరావును శనివారం తెల్లవారుజాము నుంచి పోలీసులు గృహనిర్బంధం చేశారు. వాస్తవానికి ఆయన ఆధ్వర్యంలో పలువురు సీపీఎస్ ఉద్యోగులు విజయవాడ వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో ఇంటి నుంచి కదలకుండా చేశారు. అలాగే ఇతర నేతలు, పలువురు ఉద్యోగులు సైతం విజయవాడ వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. తమ అనుమతి లేకుండా విజయవాడ వెళితే చట్టపరమైన చర్యలు చేపడతామని పరోక్షంగా హెచ్చరించారు. ఇదిలావుండగా వివిధ మండలాల నుంచి విజయవాడ బయలుదేరిన ఉద్యోగులను మార్గమధ్యలో అడ్డుకుని సమీపంలోని పోలీస్ స్టేషన్లకు తరలించారని సంఘం నేతలు తెలిపారు.

ఇదిలావుండగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మహేశ్వరరావు, పలువురు ఉద్యోగులను డుంబ్రిగుడ పోలీసులు స్టేషన్‌కు పిలిపించి నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్వరరావు మాట్లాడుతూ, ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఉద్యమిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు నోటీసులు ఇవ్వడం దారుణమని అన్నారు. ఓపీఎస్‌ను పునరుద్ధరించే వరకు పోరాడతామని అన్నారు.

» శంఖారావం సభకు భారీగా తరలివచ్చిన జనం
» రానున్న ఎన్నికల్లో విజయమే ధ్యేయమని ప్రతిజ్ఞ

లోకేశ్‌కు నీరాజనం

టీడీపీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన యువ నేత

శంఖారావం పేరట తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ నిర్వహిస్తున్న సభలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. విజయనగరం జిల్లాలో పర్యటనను ముగించుకుని శనివారం మధ్యాహ్నం జిల్లాలో ప్రారంభించిన కార్యక్రమానికి జనం అడుగడుగునా హారతులు పట్టారు. పెందుర్తి మండలం కృష్ణరాయపురం, భీమిలి మండలం చిట్టివలసలో జరిగిన సభలకు పార్టీ శ్రేణులతో పాటు వివిధ వర్గాల ప్రజలు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో పార్టీ విజయం దిశగా తీసుకోవాల్సిన చర్యలపై శ్రేణులకు లోకేశ్ దిశా నిర్దేశం చేశారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి


చిట్టివలస సభలో లోకేశ్ ప్రసంగానికి కేరింతలు కొడుతున్న టీడీపీ శ్రేణులు, అభిమానులు


వేదికపై లోకేశ్ విజయ శంఖారావం


కృష్ణరాయపురం శంఖారావం సభ వేదికపై ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న లోకేశ్, బండారు, తదితరులు


కృష్ణరాయపురం వేదిక వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న లోకేశ్


వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారితో నారా లోకేశ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు


చంద్రబాబు ప్రకటించిన ఆరు గ్యారెంటీల కరపత్రాలను ప్రదర్శిస్తున్న మహిళా కార్యకర్తలు


పెందుర్తి నియోజకవర్గ నేతలు, కార్యకర్తలతో మాట్లాడుతున్న లోకేశ్


జాలరి వల, బుంగను బహూకరిస్తున్న నూకరాజు


లోకేశ్‌కు జ్ఞాపిక బహూకరిస్తున్న జనసేన నేత పంచకర్ల సందీప్


చిట్టివలస సభా వేదికపై లోకేశ్‌తో చర్చిస్తున్న శ్రీభరత్ చిత్రంలో పంచకర్ల సందీప్ ఉన్నారు


భీమిలి నియోజకవర్గ నాయకులకు దిశా నిర్దేశం చేస్తున్న లోకేశ్


వెంకటాపురం సమస్యలపై లోకేశ్‌కు వినతిపత్రం అందిస్తున్న స్థానికులు


ప్రతిజ్ఞ చేస్తున్న లోకేశ్, బండారు, బుద్దా నాగజగదీశ్, పంచకర్ల, పీలా శ్రీనివాసరావు


చిన్నారులతో సరదాగా...


లోకేశ్‌కు అంబేడ్కర్ విగ్రహాన్ని బహూకరిస్తున్న పార్టీ కార్యకర్తలు

క్రైం... crime news

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

చింతపల్లి, ఫిబ్రవరి 17: మండల కేంద్రంలోని పెదపైపువీధిలో ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. పెదపైపువీధికి చెందిన రమేశ్, చింత నందిని (23) దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. రమేశ్ తాపీమేస్త్రీగా పనిచేస్తుండగా, నందిని గృహిణి. రోజు మాదిరిగానే రమేశ్ శనివారం ఉదయం పనికి వెళ్లిపోయాడు. సాయంత్రం గృహానికి వచ్చేసరికి భార్య ఉరి వేసుకుని కనిపించింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు వచ్చి చూడగా అప్పటికే నందిని మృతి చెందింది. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్టు ఎస్ఐ కె.అరుణ్ కిరణ్ తెలిపారు.

తహసీల్దార్ రమణయ్య బంధువు రాజేంద్ర మృతి

» గుండెపోటు వల్లే చనిపోయినట్టు కుటుంబ సభ్యుల వెల్లడి

విశాఖపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల రెండో తేదీన హత్యకు గురైన తహసీల్దార్ సనపల రమణయ్యకు బంధువుగా చెప్పుకున్న ప్రధాన రాజేంద్ర (47) శుక్రవారం రాత్రి మృతిచెందారు. ప్రసాద్ అనే వ్యక్తి తనకు ఫోన్ చేసి చీపురుపల్లిలోని తమ భూమిలో అడుగుపెట్టొద్దని, అడుగు పెట్టినట్టయితే చంపేస్తానని బెదిరించారంటూ తహసీల్దార్ హత్య జరిగిన మరుసటిరోజు రాజేంద్ర మీడియాకు వెల్లడించిన విషయం తెలిసిందే. తనను బెదిరించిన ప్రసాదే తనకు వరుసకు సోదరుడయ్యే తహసీల్దార్ రమణయ్యను హత్య చేసి ఉంటాడని రాజేంద్ర అనుమానం వ్యక్తంచేశారు. అయితే రమణయ్యను హత్య చేసింది మురారి సుబ్రహ్మణ్యం గంగారావు అని పోలీసుల దర్యాప్తులో తేలింది. అతడిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. ఇదిలావుండగా తహసీల్దార్ బంధువుగా చెప్పుకుంటున్న ప్రధాన రాజేంద్ర శుక్రవారం మృతిచెందడం చర్చనీయాంశంగా మారింది. పోలీసులు, ప్రసాద్, తదితరుల ఒత్తిళ్లను తట్టుకోలేకే రాజేంద్ర మృతిచెందాడంటూ ప్రచారం జరిగింది. అయితే రాజేంద్ర భార్య త్రివేణి మాత్రం తన భర్తకు గుండెపోటు రావడం వల్లే మృతి చెందారని, ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదని స్పష్టంచేశారు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం కోటపాటు కొత్తూరుకు చెందిన ప్రధాన రాజేంద్ర పదేళ్ల కిందట విశాఖ వచ్చి ఎంవీపీకాలనీలోని గాదిరాజు ఎంపైర్స్‌లో కుటుంబంతో నివాసం ఉంటున్నారు. భార్య త్రివేణితోపాటు ఏడేళ్ల కుమార్తె ఉంది. రాజేంద్ర కొంతకాలం కిందటి వరకూ అనకాపల్లిలో మహీంద్ర ట్రాక్టర్ల షోరూమ్ నిర్వహించేవారు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కొనసాగుతున్నారు.

కాగా త్రివేణి కథనం ప్రకారం...మధుమేహం కలిగి ఉన్న రాజేంద్ర శుక్రవారం రాత్రి భోజనం చేసిన తర్వాత ఒక్కసారిగా షుగర్ లెవెల్స్ పెరిగిపోవడంతో కుప్పకూలిపోయారు. వెంటనే షీలానగర్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించామని, అక్కడ చికిత్స పొందుతూ రాత్రి పది గంటల సమయంలో మృతిచెందారు. కార్డియాక్ అరెస్టు వల్లే రాజేంద్ర మృతిచెందినట్టు వైద్యులు కూడా నిర్ధారించారన్నారు. తన భర్త అంత్యక్రియలు కూడా పూర్తయినందున ఆ విషయాన్ని అక్కడితో వదిలేయాలని ఆమె కోరారు. తన భర్త మృతి చెందడంతో ఏడేళ్ల కుమార్తెతో ఎలా బతకాలో తెలియని స్థితిలో ఉన్న తమను కొన్ని టీవీ ఛానల్స్ తప్పుడు వార్తలు ప్రసారం చేసి మనోవేదనకు గురిచేస్తున్నారని వాపోయారు. ఏదైనా లేనిపోని అనుమానాలతో కథనాలు ప్రసారం చేస్తే ఆయా మీడియా సంస్థల పేరు చెప్పి తన కుమార్తెతో కలిసి ఆత్మహత్య చేసుకోవడం ఒక్కటే తనకు మార్గమని త్రివేణి ఆవేదన వెళ్లగక్కారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	115.00
లైవ్ ధర	135.00
విత్ స్కిన్	240.00
స్కిన్ లెస్	250.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

సైకో సీఎం పాలనలో క్రీడలకూ గ్రహణం

» రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల ప్రారంభోత్సవంలో 'అయ్యన్న'


పోటీలను ప్రారంభిస్తున్న అయ్యన్నపాత్రుడు


తూర్పు గోదావరి, విజయనగరం జట్ల మధ్య పోటీ

మునగపాక, ఫిబ్రవరి 17 : రాష్ట్రానే కాదు.. క్రీడలకూ గ్రహణం పట్టించిన సైకో ముఖ్యమంత్రి దొరకడం ప్రజలు చేసుకున్న దురదృష్టమని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. మండలంలోని నాగులాపల్లిలో శనివారం రాత్రి మాజీ ఎంపీ పెతకంశెట్టి అప్పలనరసింహం 88వ జయంతి సందర్భంగా నారా లోకేష్ యువగళం కప్ రాష్ట్రస్థాయి స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలకు మన రాష్ట్రానికి ఒక ప్రత్యేకత ఉండేదన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక రూ.వంద కోట్లతో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టారని, క్రీడలను చూద్దామని టీవీ ఆన్ చేస్తే బ్యాట్ పట్టుకుని సైకో ముఖ్యమంత్రి, మరోవైపు బ్యాట్ పట్టుకుని మంత్రి రోజా వీరిద్దరే ఆడుకుంటున్నారని క్రీడాకారులను చూపించలేదని ఎద్దేవా చేశారు. విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ చాలా ప్రభుత్వాలు వచ్చినా ఒక్క తెలుగుదేశం పార్టీ మాత్రమే క్రీడలకు ప్రోత్సాహం అందించిందన్నారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ యువకుల ఆటల కోసం తాను పరవాడలో స్టేడియం నిర్మిస్తే, ప్రస్తుత ఎమ్మెల్యే దీనిని ప్రారంభించి అద్దెకు ఇచ్చుకున్నారన్నారు. అనకాపల్లిలో స్టేడియాన్ని కూడా కోడిగుడ్డు మంత్రి భ్రష్టు పట్టించారని ఎద్దేవా చేశారు. పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ జిల్లా నాయకుడు దాడి రత్నాకర్, పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, నాయకులు బీమరశెట్టి శ్రీనివాసరావు, దాడి ముసిలినాయుడు, ధూళి రంగనాయకులు, మొల్లేటి సత్యనారాయణ, రాజునాయుడు, మాజీ సర్పంచ్ యల్లపు భాస్కరరావు, జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశురాం తదితరులు పాల్గొన్నారు. అనంతరం తూర్పు గోదావరి, విజయనగరం మహిళా జట్లు హోరాహోరీగా తలపడ్డాయి.

మహిళలు చట్టాలను వినియోగించుకోవాలి

» జిల్లా జడ్జి శ్రీవిద్య



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీవిద్య

అనకాపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మహిళలు పోస్కో చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పదవ అదనపు జడ్జి శ్రీవిద్య సూచించారు. మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో కోర్టు కాంప్లెక్స్‌లో శనివారం మహిళలకు సదరు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాలా మంది చట్టాలను ఉపయోగించుకోవడంలో నిర్లిప్తతగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు మహిళా రక్షణకు అనేక చట్టాలను ప్రవేశ పెట్టాయన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి గంగరాజు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రదీప, రెండో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి విజయలక్ష్మి, డీఈవో లక్ష్మమ్మ, ప్రెసిడెంట్ సాయి, ఎంఎల్ఎస్‌సీ ప్రతినిధి సత్యనారాయణ, లక్ష్మణ్, ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టించే వారిపై బైండోవర్ : ఎస్పీ



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 17 : రానున్న ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని అల్లర్లు, సమస్యలను సృష్టించే వారిని, పాత నేరస్థులను ముందుగా గుర్తించి బైండోవర్ చేయాలని ఎస్పీ కేవీ మురళీకృష్ణ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం రాత్రి నిర్వహించిన నెలవారీ సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ఏడాది కావడంతో జిల్లాలోని ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూడాలన్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు పోలీసులు నడుం బిగించాలన్నారు. దర్యాప్తులో ఉన్న సాధారణ, తీవ్రమైన, ముఖ్యమైన కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఏఎస్పీలు విజయభాస్కర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే రహదారి భద్రత సాధ్యం : కలెక్టర్

అనకాపల్లి , ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : అవగాహనతోనే రహదారి భద్రత సాధ్యమని జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అన్నారు. రహదారి భద్రతా దినోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం పోలీస్, రవాణా శాఖ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీని తొలుత కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. రింగురోడ్డు నుంచి నెహ్రూచౌక్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరిలో అవగాహన కలిగించడం మూలంగానే రహదారి భద్రత సాధ్యమవుతుందన్నారు. రోడ్లు, ట్రాఫిక్ లైట్లు, చిహ్నాలు పాడైతే వెంటనే మరమ్మతులు చేయించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధించడం, వాహనదారులు, ప్రయాణికులు, బాటసారులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించడం వంటివి చేయాలన్నారు. జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రమాదాలకు ఆస్కారం ఉన్న బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి, డ్రైవర్లను అప్రమత్తం చేస్తున్నట్టు చెప్పారు. జరిమానాలు, అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాల సంఖ్య తగ్గిందన్నారు.


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి డీఎస్పీ వి.సుబ్బరాజు, రవాణాశాఖ జిల్లా అధికారి కె.ప్రకాశరావు, డీసీఎం సభ్యుడు అప్పారావు, ఆటో డ్రైవర్లు, వలంటీర్లు, విద్యార్థులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల విధులపై పోలీసులకు శిక్షణ

అనకాపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్ర జ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో సమర్థవంతంగా విధులను నిర్వహిం చేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్ పోలీస్ సిబ్బందికి సూచించారు. ఇక్కడి రోటరీ కల్యాణ మండపంలో ఎన్నికల విధుల నిర్వహణకు సంబంధిత అంశాలపై శనివారం ఏర్పాటైన శిక్షణ తరగతుల్లో మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియ, విధి విధానాలు, ఎన్నికల నియమ నిబంధనలు, ప్రవర్తనా నియమావళి, ఎన్నికలకు సంబంధించిన చట్టాలను వివరించారు. గంజాయి రవాణా, అక్రమ మద్యం, నగదు, ఇతర వస్తువులు సీజ్ చేయడం, తరుచూ గ్రామాలను సందర్శించి సమాచారం చేయాలన్నారు. పరవాడ, అనకాపల్లి డీఎస్పీలు కేవీ సత్యనారాయణ, వి.సుబ్బరాజు, ట్రైనీ డీఎస్పీ భవ్య, ఇన్‌స్పెక్టర్లు అప్పలనాయుడు, గణేష్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో పనిచేయడం అదృష్టంగా భావించాలి

బదిలీపై వెళుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

సుమిత్‌కుమార్‌కు పాడేరులో ఘనంగా వీడ్కోలు





కలెక్టర్‌పై పూలు చల్లుతున్న ఉద్యోగులు... థింసా నృత్యంతో సుమిత్‌కుమార్‌ను ఊరేగింపుగా తీసుకువస్తున్న జేసీ, పీవో

పాడేరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో పని చేయడం పనిష్మెంటు కాదని, అదృష్టంగా భావించి సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లాకు బదిలీ అయిన సందర్భంగా కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన వీడ్కోలు సభలో సుమిత్‌కుమార్ మాట్లాడారు. విధి నిర్వహణలో నిజాయితీ, పారదర్శకతలే ప్రధానమని, గిరిజనులతో స్నేహపూర్వకంగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు. గిరిజనులను ఉన్నతంగా ఉండేలా కృషి చేయాలని అధికారులకు హితవు పలికారు. పట్టణాల్లో అన్ని సౌకర్యాలు ఉంటాయని, ఎటువంటి సౌకర్యాలు లేని గిరిజన ప్రాంతాల్లో పనిచేసి చక్కని సేవలు అందించాలని సూచించారు. తను మొదటిసారి పాడేరు వచ్చి మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకున్నపుడు, చక్కని సేవలు అందించగలనా? లేదా? అనే భయం కలిగిందని, కాని గిరిజనులకు చక్కని సేవలు అందించాననే సంతృప్తి ప్రస్తుతం కలిగిందని చెప్పారు. అలాగే కొత్తగా ఏర్పడిన ఈ జిల్లా అభివృద్ధికి అధికారులు కష్టపడి పనిచేస్తున్నారని ఆయన ప్రశంసించారు. జిల్లాలో పని చేసిన అనుభవాన్ని ఎప్పటికీ మర్చిపోనన్నారు. జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పీవోలు వి.అభిషేక్, సూరజ్‌గనోరే, చైతన్య, పాడేరు సబ్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివకిశోర్ తదితరులు కలెక్టర్ సేవలను కొనియాడారు.

ఘనంగా వీడ్కోలు కార్యక్రమం

జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ వీడ్కోలు కార్యక్రమాన్ని అధికారులు, ఉద్యోగులు శనివారం ఘనంగా నిర్వహించారు. పాడేరు-అరకులోయ మెయిన్ రోడ్డులోని తలారిసింగి కూడలి నుంచి కలెక్టరేట్ వరకు సుమారు ఒక కిలోమీటరు ఆయనపై పూలు చల్లుతూ, థింసా నృత్యాలు, మేళతాళాలతో ఊరేగించారు. అనంతరం కలెక్టరేట్‌లో శాలువాలు కప్పి జ్ఞాపికలు, బొకేలు అందించి సత్కరించారు. ఈ క్రమంలో సుమిత్ కుమార్ భావోద్వాగానికి గురయ్యారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మణమూర్తి, ఐటీడీఏ ఏపీవో ప్రభాకరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వీవీఎస్.శర్మ, పి.అంబేడ్కర్, టీడబ్ల్యూ డీడీ ఐ.కొండలరావు, ఈఈ డీవీఆర్ఎం.రాజు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రైతులతో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

పంపుసెట్లతో నీరు సరఫరా చేయాలని గిరిజన రైతుల ఆందోళన

అరకులోయ, ఫిబ్రవరి 17: పెదలబుడు పంచాయతీ పరిధిలోని శర్భగుడ, కంటబొంసుగుడ, తాంగులగుడ, నిసానిగుడ గ్రామాల్లో పంట పొలాలకు లిఫ్ట్ ఇరిగేషన్ పంపుసెట్లతో నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ గిరిజన రైతులు ఆందోళనకు దిగారు. సీపీఎం మండల కార్యదర్శి కె.రామారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. నాలుగు గ్రామాల పరిధిలో వందకు పైగా రైతులు సుమారు 400 ఎకరాలకుపైగా పంట సాగు చేస్తున్నారని, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఉన్నప్పటికీ విద్యుత్ సౌకర్యం లేక నీరు సరఫరా కావడం లేదని వారంతా ఆందోళన చెందుతున్నారని ఈ సందర్భంగా రామారావు వాపోయారు. విద్యుత్ కనక్షన్లు పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంక్షేమ సంఘం ప్రతినిధులు తాంగుల హరి, బికోటేశ్వరరావు, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.



పాడేరు పట్టు పరిశ్రమ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

జిల్లా కేంద్రంలో ఉద్యోగులు, పెన్షనర్ల ధర్నా

పాడేరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌పై జిల్లా కేంద్రం పాడేరులో శనివారం ఉద్యోగులు, పెన్షనర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా చేశారు. ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో చేపడుతున్న ఉద్యమ శంఖారావం ఆందోళనలో భాగంగా శనివారం జిల్లా, డివిజన్ కేంద్రాల్లో ధర్నాలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు ఏపీ ఎన్‌జీవో పాడేరు డివిజన్ ఆధ్వర్యంలో ఎన్‌జీవో భవనం ముందు ఉద్యోగులు, పెన్షనర్లు ధర్నా చేపట్టారు. అలాగే పట్టు పరిశ్రమ శాఖ కార్యాలయం ముందు పలువురు ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ముఖ్యంగా ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం బకాయిపడ్డ ఆర్థిక రాయితీలను చెల్లించాలని, 11వ పీఆర్‌సీలో సమస్యలు పరిష్కరించడంతో పాటు 12వ పీఆర్‌సీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగులు, పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని, ఉద్యోగులపై ప్రభుత్వ కక్షసాధింపులు, వేధింపులను విరమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీవో డివిజన్ కమిటీ కార్యదర్శి ఎస్.సంజీవరాజు, పెన్షనర్ల సంఘం నేతలు రొబ్బా నాగభూషణరాజు, శ్రీహరి, జి.మోహనరావు, తిరుపతిరావు, ఉద్యోగ, పెన్షనర్ల సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సోలార్ ఇరిగేషన్ యూనిట్లు వినియోగించుకోండి

ఐటీడీఏ పీవో అభిషేక్



సోలార్ ఇరిగేషన్ యూనిట్‌లను పరిశీలిస్తున్న పీవో

పాడేరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులకు ఉచితంగా అందిస్తున్న సోలార్ ఇరిగేషన్ యూనిట్లు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ చెప్పారు. కేంద్ర నిధులతో మంజూరైన సోలార్ ఇరిగేషన్ యూనిట్లను కొయ్యూరు మండలానికి చెందిన ఆరుగురికి ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.1.15 లక్షల విలువైన సోలార్ సాగునీటి యూనిట్‌లను గిరిజన రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, వాటిని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ఐటీడీఏ పరిధిలో 110 యూనిట్లు గిరిజన రైతులకు పంపిణీ లక్ష్యంగా చర్యలు చేపట్టామని, ఇప్పటికే 103 యూనిట్లు పంపిణీ చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో వీఎస్.ప్రభాకరరావు, ప్రాజెక్టు వ్యవసాయాధికారిణి కె.ఝాన్సీలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు: ఎమ్మెల్యే



ఎస్సీ కాలనీలో డ్రైనేజీ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

చింతపల్లి, ఫిబ్రవరి 17: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించనున్నట్టు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. శనివారం ఎస్సీ కాలనీలో పర్యటించిన ఆమె డ్రైనేజీ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అలాగే రూ.3 లక్షలతో నిర్మించిన సీసీ ర్యాంప్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్సీ కాలనీలో నివసిస్తున్న దళితులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎస్సీ ఉప ప్రణాళిక నిధులు దళితుల ప్రయోజనాల కోసం కేటాయించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోరాబు అనుషదేవి, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, సర్పంచ్ డి.పుష్పలత, వైసీపీ మండల అధ్యక్షుడు మోరీ రవి, ఎంపీటీసీ సభ్యులు జయలక్ష్మి, దారలక్ష్మిపద్మ తదితరులు పాల్గొన్నారు.

చలి తీవ్రతరం.. వణుకుతున్న గిరిజనం

» అరకులో 8.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత... దట్టంగా పొగ మంచు



ముంచంగిపుట్టులో దట్టంగా కురుస్తున్న పొగ మంచు

పాడేరు/చింతపల్లి/ముంచంగిపుట్టు ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి ముగిసిన తరువాత కూడా ఏజెన్సీలో చలి తీవ్రత కొనసాగుతున్నది. శుక్రవారంతో పోలిస్తే కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. శనివారం అరకులో 8.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. జి.మాడుగులలో 9.1 డిగ్రీలు, పాడేరులో 9.4, జీకే వీధిలో 10, చింతపల్లిలో 10.1, హుకుంపేటలో 10.5, పెదబయలులో 11.7, ముంచంగిపుట్టులో 12 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చింతపల్లి, జీకే వీధి మండలాల్లో మంచు ప్రభావం అధికంగా వుంది. అర్ధరాత్రి నుంచి ఉదయం ఎనిమిది గంటల వరకు మంచు దట్టంగా కురుస్తున్నది. దీంతో చలి తీవ్రత కొనసాగుతున్నది. ముంచంగిపుట్టులో శనివారం ఉదయం 10 గంటలు వరకు మంచు తెరలు వీడలేదు. వివిధ పనుల నిమిత్తం ఉదయం వేళల్లో బయటకు వెళ్లేవారు చలికి తట్టుకోలేక ఇబ్బంది పడుతున్నారు. మధ్యాహ్నం తప్ప రోజులో మిగిలిన సమయమంతా వాతావరణం శీతా కాలంలా ఉంటున్నది. జిల్లా కేంద్రం పాడేరు, పరిసర ప్రాంతాల్లో పొగమంచు ప్రభావం లేనప్పటికీ చలి అధికంగానే ఉంది.

టీడీపీతోనే గిరిజనులకు సంక్షేమం

» అరకు, పాడేరు నియోజకవర్గాల ఇన్‌చార్జులు దొన్నుదొర, ఈశ్వరి



టీడీపీలో చేరిన కార్యకర్తలకు కండువాలు వేస్తున్న దొన్నుదొర, గిడ్డి ఈశ్వరి

పెదబయలు, ఫిబ్రవరి 17: తెలుగుదేశం పార్టీతోనే గిరిజనుల సంక్షేమం సాధ్యమని అరకులోయ, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జులు సియ్యారి దొన్నుదొర, గిడ్డి ఈశ్వరి అన్నారు. మండలంలోని మారుమూల గిన్నెలకోట, జామిగూడ, ఇంజరి, బూసిపుట్టు తదితర పంచాయతీల్లో శనివారం పర్యటించి గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా టీడీపీ ప్రవేశ పెట్టిన మినీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. ఆయా గ్రామాల నుంచి సుమారు 200 మంది ఇతర పార్టీలకు చెందిన కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి దొన్నుదొర, గిడ్డి ఈశ్వరి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా దొన్నుదొర మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస రాజ్యం నడుస్తున్నదని ఆరోపించారు. రాజారెడ్డి రాజ్యాంగం అమలు చేస్తూ అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ రెడ్డి ఒక్క ఛాన్స్ అంటూ వచ్చి రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచేశాడన్నారు. వైసీపీ ప్రభుత్వం గిరిజనుల పక్షపాతి అంటూ గిరిజనులను నిండా ముంచేసిందని వాపోయారు. గిరిజనుల అభివృద్ధిని గాలికి వదిలేసి వారి సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను పక్కదారి పట్టించి నమ్మక ద్రోహం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. జీవో నంబర్-3ను తొలగించడంతో ఏజెన్సీ ప్రాంతంలో గల ఆదివాసీ గిరిజన యువతకు ఉద్యోగాలకు దూరం చేసి నిరుద్యోగులుగా మిగిలేలా చేశారని విమర్శించారు. ఏ గ్రామంలో చూసినా కనీస సౌకర్యాలకు ఆమడ దూరంలోనే ఉన్నాయన్నారు. ఈ నిరంకుశ పాలనకు అంతంమందించే రోజులు దగ్గరపడ్డాయని, ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో టీడీపీ జెండా రెపరెపలాడుతుందని, రాష్ట్రంలో తమ అధినేత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవుతారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ టీడీపీ ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలు నమ్ముతున్నారని, నిత్యావసర వస్తువుల ధరలు పెంచి మధ్యతరగతి ప్రజల నడ్డి విరిస్తున్న ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎద్దేవా చేశారు. పలికారు. జగన్ రెడ్డిని గద్దె దించడం ఖాయమని చెప్పారు. రానున్నది టీడీపీ/జనసేన ప్రభుత్వమేనని, చంద్రన్న రాజ్యం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుకుమారి, కొండయ్య, కొండబాబు, చిన్నిబొంజుబాబు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థిక రాజధానిగా విశాఖ

... 5వ పేజీ తరువాయి

రూ.500 కోట్లతో ప్యాలెస్ కట్టుకున్నాడని దుయ్యబట్టారు. తాము విశాఖను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని, గ్రీన్ కారిడార్ ఏర్పాటు చేయడంతోపాటు ఫ్లై ఓవర్లు, అండర్ బ్రిడ్జిలు నిర్మించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. మెడికల్ డివైస్ తయారీ హబ్‌గా, ఐటీ కేంద్రంగా విశాఖను తీర్చిదిద్దుతామని లోకేష్ స్పష్టంచేశారు. ఏటా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తామని, ఉద్యోగం వచ్చేంత వరకు మూడు వేల నిరుద్యోగ భృతి చెల్లిస్తామని నిరుద్యోగులకు హామీ ఇచ్చారు. భీమిలి నియోజకవర్గంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, 2019 ఎన్నికల్లో తనను ఇక్కడి నుంచి పోటీ చేయాల్సిందిగా చంద్రబాబు చెప్పారన్నారు. కానీ, మూడు దశాబ్దాల నుంచి టీడీపీ గెలవని స్థానాన్ని కోరి మరీ మంగళగిరి నుంచి తాను పోటీ చేశానని, స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యానన్నారు. భీమిలి నుంచి పోటీ చేస్తే తనతోపాటు భరత్ కూడా నెగ్గేవాడని, ఆ మాట ఇప్పటికీ భరత్ చెబుతుంటాడన్నారు. భవిష్యత్తులో కూడా భీమిలిని అభివృద్ధి చేసే బాధ్యతను తాము తీసుకుంటామని స్పష్టం చేశారు.

2014 నుంచి 2019 వరకు ఇక్కడ వేయి కోట్ల అభివృద్ధి పనులు చేశామని, ఇండోర్ స్టేడియం, మిలీనియం టవర్ ఏర్పాటుచేయడంతోపాటు టిడ్కో ఇళ్లను నిర్మించామన్నారు. 2019లో భీమిలి నియోజకవర్గ ప్రజలు పాలిచ్చే ఆవును కాదని, తన్నే దున్నపోతును గెలిపించుకున్నారన్నారు. అర గంట అవంతి మంత్రిగా పనిచేసినా ఇక్కడి అభివృద్ధి పనులు చేయలేదని, ప్రజల జీవితాల్లో మార్పులు రాలేదన్నారు. ఆయనకు రాసలీలలు మాత్రమే తెలుసునని ఎద్దేవా చేశారు. ఆయన వ్యవహారాన్ని చూడలేక ఇక్కడి ప్రజలు తలదించుకునే పరిస్థితి దాపురించిందన్నారు. వైసీపీ నాయకులు అవినీతికి కేరాఫ్‌గా భీమిలిని మార్చారని, రాష్ట్రంలోని నాయకులంతా ఇక్కడి భూములపై పడ్డారని ఆరోపించారు. ఈ ప్రాంతానికి చెందిన రూ.2500 కోట్ల విలువైన భూములను వైకాపా నాయకులు దోచుకున్నారన్నారు. అరగంట అవంతి అవినీతి పెరిగిపోయిందని, అనేక పోస్టులు అమ్ముకున్నాడని, జూట్ ఫ్యాక్టరీ నుంచి డబ్బులు తీసుకుని కార్మికులకు న్యాయం చేయలేదని ఆరోపించారు. తనకు అక్కా, చెల్లెళ్లు, అన్నదమ్ములు లేరని, 60 లక్షల మంది పార్టీ నాయకులు, కార్యకర్తలే తనకు అక్క, చెల్లెళ్లు, అన్నదమ్ములన్నారు. టీడీపీ, జనసేన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.శ్రీభరత్, భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ సందీప్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రకు పట్టిన దరిద్రం జగన్

... 5వ పేజీ తరువాయి

పెందుర్తి మండలం కృష్ణరాయపురం ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించిన శంఖారావం సభలో ఆయన ప్రసంగించారు. చంద్రబాబు హయాంలో నగరానికి ఐటీ పరిశ్రమలు, అదానీ డేటా సెంటర్, మెడ్‌టెక్ జోన్ తీసుకువచ్చారని, జగన్ పాలనలో భూకబ్జాలు, కిడ్నాప్‌లు, దోపిడీలు, చెరువుల ఆక్రమణలు జరుగుతున్నాయన్నారు. ఉత్తరాంధ్రకు పట్టిన దరిద్రం జగన్ అని వ్యాఖ్యానించారు. ఉత్తరాంధ్రను దోచుకునేందుకు బొత్స, విజయసాయిరెడ్డి, సుబ్బారెడ్డి కుటుంబాలకు లైసెన్స్ ఇచ్చారన్నారు. వీరంతా పందికొక్కులా దోచుకున్నారని ఆరోపించారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించాలని జగన్ చూస్తున్నారని ఆరోపించారు. టీడీపీ, జనసేన ప్రభుత్వం వచ్చిన వెంటనే విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కొనుగోలు చేస్తోందన్నారు. టీడీపీ, జనసేన కేడర్ మధ్య చిచ్చు పెట్టేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందన్నారు. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు.

జగన్‌ది రాజారెడ్డి రాజ్యాంగం

తాను బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగానికి లోబడి పనిచేస్తానని, అదే జగన్ మాత్రం రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని ఆరోపించారు. తాను ప్రజల్లో తిరుగుతుంటే జగన్ మాత్రం పరదాల మాటున పర్యటనలు చేస్తున్నారని ఆరోపించారు. మంత్రిగా తాను టీసీఎల్, హెచ్‌సీఎల్, ఫాక్స్‌కాన్, జోహో..వంటి పరిశ్రమలు తీసుకువస్తే జగన్ బూమ్‌బూమ్, ప్రెసిడెంట్ మెడల్ వంటి మద్యం బ్రాండ్లు తీసుకువచ్చారన్నారు.

నవ మోసాలు

ఎన్నికల ముందు నవరత్నాలు అని ఊదరగొట్టిన జగన్, అధికారంలోకి వచ్చిన తరువాత దానిని నవ మోసాలుగా చేశారని లోకేశ్ ధ్వజమెత్తారు. మద్య నిషేధం చేసిన తరువాతే ఓట్లు అడుగుతానని ప్రజలను నమ్మించిన వ్యక్తి...మాట తప్పడమే కాకుండా నేడు వీధివీధినా మద్యం అమ్ముతున్నారన్నారు. ప్రజల కష్టాలు చూసి చంద్రబాబు సూపర్ సిక్స్ ప్రకటించారని గుర్తుచేశారు. తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేస్తామని ప్రకటించారు. బూత్ స్థాయి అధ్యక్షులు, ముఖ్యమైన నాయకులు రానున్న రెండు నెలల్లో ప్రజల్లోకి వెళ్లి సూపర్ సిక్స్ కోసం ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. సభలో పెందుర్తి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి బండారు సత్యనారాయణమూర్తి, జనసేన రూరల్ అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడారు. అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షుడు బుద్ధ నాగజగదీశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి కేడర్‌కు లోకేశ్ సూపర్ సిక్స్ కిట్లు పంపిణీ చేశారు.

వైద్యుల పర్యవేక్షణలో విద్యార్థినులకు చికిత్స

అరకులోయ, ఫిబ్రవరి 17: గిరిజన సంక్షేమ శాఖ వసతిగృహాల్లో చదువుకుతున్న ఇద్దరు బాలికలను అరకులోయ, విశాఖలోని కేజీహెచ్ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నామని ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు తెలిపారు. శనివారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ కొత్తభల్లుగుడ గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమోన్నత పాఠశాలలో చదువుతున్న కె.జోత్స్న బ్రీతింగ్ సమస్య రావడంతో శుక్రవారం రాత్రి అరకు ఆసుపత్రికి తరలించినట్టు చెప్పారు. అలాగే బాలిక తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చామన్నారు. అలాగే యండపల్లివలస గురుకుల బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థిని జాన్సీ స్కిన్ ఎలర్జీ రావడంతో శుక్రవారం అరకులోయ ఆసుపత్రిలో చేర్పగా ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచనల మేరకు కేజీహెచ్‌కు తరలించామని ఆయన వివరించారు.

ఉపాధ్యాయులకు పోలీసుల నోటీసులు



ఉపాధ్యాయులకు నోటీసులు ఇస్తున్న పోలీసులు

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 17: సీపీఎస్, జీపీఎస్ రద్దు చేయాలని కోరుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా ఉపాధ్యాయులకు పోలీసులు నోటీసులను జారీ చేసింది. మండల కేంద్రంలోని డుంబ్రిగుడ పోలీసు స్టేషన్‌లో యూటీఎఫ్ నాయకులను శనివారం పోలీసులు పిలిపించి నోటీసులను అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మహేశ్వరరావు మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తుంటే నోటీసులు అందించి ఉద్యమాన్ని నీరుగార్చడానికి పూనుకోవడం సరికాదన్నారు. పాత పింఛన్ విధానం అమలు చేసేవరకు పోరాడతామని స్పష్టం చేశారు. యూటీఎఫ్ నాయకులు శెట్టి బాలక్రిష్ణ, దుక్కు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిలో 350 మందికి నేత్ర పరీక్షలు

చింతపల్లి, ఫిబ్రవరి 17: మండల కేంద్రంలోని జడ్పీహెచ్ పాఠశాలలో శనివారం నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో 350 మందికి పరీక్షలు చేశారు. గిరిజన ఉద్యోగుల సంఘం, శంకర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరానికి చింతపల్లి, జీకే వీధి మండలాల నుంచి అధిక సంఖ్యలో ఉద్యోగులు, గిరిజనులు హాజరయ్యారు. వైద్యాధికారులు శక్తి, శశి నేత్ర తనిఖీలు చేసి, అవసరమైన వారికి కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. అలాగే 30 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. ఈ శిబిరంలో శంకర్ ఫౌండేషన్ మేనేజర్ చంద్రశేఖర్, గిరిజన ఉద్యోగుల సంఘం ప్రతినిధులు యావీగిరి, బౌడు గంగరాజు, గిడ్డి వరలక్ష్మి, నాయకులు గెమ్మెలి మోహన్, ఎల్.చిట్టినాయుడు, జీవీ రమణమూర్తి, రామరాజు పడాల్, వీరభద్రరావు, ఎంఈవో పనసల ప్రసాద్, హెచ్ఎం గోపీనాథ్ పాల్గొన్నారు.

మహిళల భద్రతకు సరికొత్త పరికరం

... 5వ పేజీ తరువాయి

అవసరమైన పరికరాలను ఉపాధ్యాయులు సూచించగా, సుమారు రూ.2 వేలతో వివిధ రకాల ఎలక్ట్రానిక్ పరికరాలను కొనుగోలు చేశారు. వీటితో నాలుగు సెంటీమీటర్ల పొడవు, మూడు సెంటీమీటర్లు వెడల్పుతో, సిమ్ అమర్చి ఒక పరికరాన్ని తయారు చేశారు. దీనికి 'ఉమెన్ సెఫ్టీ బ్యాగ్' అని పేరు పెట్టారు. దీనికి సెల్ సిగ్నల్స్ వుంటే సరిపోతుంది. ఈ పరికరాన్ని మహిళలు/ యువతులు తమ హ్యాండ్ బ్యాగ్‌లో ఎవరికి కనిపించకుండా వెంట తీసుకెళ్లవచ్చు. ఆపద సమయంలో ఈ పరికరానికి కనెక్ట్ కాబడివున్న బటన్ నొక్కితే క్షణాల్లో రిజిస్టర్ అయిన ఫోన్ నంబర్లుకు అలెర్ట్ మెసేజ్ వెళుతుంది. మహిళ లేదా యువతి ఉన్న ప్రాంతం చిత్రంతో కూడిన లొకేషన్ లింక్ వస్తుంది. అలెర్ట్ మెసేజ్‌లో వచ్చిన లింక్ ఓపెన్ చేస్తే ఆమె ఉన్న కచ్చితమైన లొకేషన్, ఫొటో కనిపిస్తుంది. దీంతో వెంటనే మహిళను రక్షించేందుకు చర్యలు తీసుకునే అవకాశమున్నది.

మొబైల్ నంబర్స్ రిజిస్టర్ చేసుకోవాలి

-జి.దాసు, జి.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు



అత్యవసర సేవలు పొందేందుకు ఉమెన్ సేఫ్టీ బ్యాగ్ పరికరంలో ముందుగా కుటుంబ సభ్యులు, సమీపంలో వున్న మహిళా కానిస్టేబుల్, ఎస్ఐ, సీఐల మొబైల్ ఫోన్ నంబర్లను రిజిస్టర్ చేసుకోవాలి. గరిష్ఠంగా 20 ఫోన్ నంబర్ల వరకు రిజిస్టర్ చేసుకోవచ్చు. లోకేషన్‌తోపాటు ఆపదలో వున్న మహిళ ఎక్కడ వుందో ఆ ప్రాంతం ఫొటో లింక్ వస్తుంది. దీంతో మహిళను రక్షించడంతోపాటు దుండగులను సులభంగా పట్టుకోవచ్చు. చింతపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థినులు రూపొందించిన పరికరం అభివృద్ధికి ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తే బాగుంటుంది. ఈ పరికరం రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక కావడం సంతోషంగా వుంది.

☛ సంక్షిప్తంగా..

తాగునీటి సౌకర్యం కల్పనలో నిర్లక్ష్యం సరికాదు

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 17: మారుమూల గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని బీజేపీ మండల అధ్యక్షుడు కిరసాని రమేష్ అన్నారు. పోతంగి పంచాయతీలోని పంతలచింతలో పార్టీ నేతలతో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టకపోవడం విచారకరమని వాపోయారు. పంతలచింత గ్రామంలో వారానికి రెండు రోజులు తాగునీరు సరఫరా చేస్తే గిరిజనులు ఎలా దాహం తీర్చుకుంటారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తాగునీటి అవసరాలను తక్షణమే తీర్చాలని కోరారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొయ్యూరు, ఫిబ్రవరి 17: స్థానిక గురుకుల పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ మోహన్ తెలిపారు. ఐదో తరగతిలో ప్రవేశానికి ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యా సంస్థల్లో నాలుగో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులన్నారు. తల్లిదండ్రులు, సంరక్షకుల సంవత్సర ఆదాయం రూ.లక్ష మించకూడదని చెప్పారు. ఏప్రిల్ 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించాలని ఆయన సూచించారు.

వైసీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకురాలుగా హైమావతి

అరకులోయ, ఫిబ్రవరి 17: వైసీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకురాలుగా మాజీ ఎమ్మెల్యే శోభ హైమావతిదేవిని అధిష్ఠానం నియమించింది. ఇప్పటివరకు పార్టీ పరిశీలకుడిగా కొండపల్లి కొండబాబు కొనసాగారు. ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో ఈ ప్రాంత నాయకులు, ప్రజలతో సంబంధాలు ఉన్న హైమావతిని నియమించినట్టు పార్టీ శ్రేణులు తెలిపాయి.

ఏపీజీవీబీ నూతన భవనం ప్రారంభం

పెదబయలు, ఫిబ్రవరి 17: మండల కేంద్రంలో ఏపీ జీవీబీ నూతన భవనాన్ని అనకాపల్లి రీజినల్ మేనేజర్ చిరంజీవి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కూడా విస్తృతంగా సేవలు అందిస్తున్న బ్యాంకు తమదేనన్నారు. పెదబయలు బ్రాంచిలో రూ.55 వేల కోట్ల లావాదేవీలు జరుగుతున్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకు మిత్రల ద్వారా అన్ని వేళలా సేవలు అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ బ్యాంకు మేనేజర్ నాగరాజు, పెదబయలు బీఎం కృష్ణ, వెలుగు ఏపీఎం కళావతి తదితరులు పాల్గొన్నారు.

శింగవరంలో రూ.23 లక్షలతో తాగునీటి పథకం

కొయ్యూరు, ఫిబ్రవరి 17: చీడిపాలెం పంచాయతీ పరిధిలోని శింగవరం గ్రామంలో రూ.23 లక్షల వ్యయంతో తాగునీటి పథకం నిర్మించనున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ విశ్వతేజ తెలిపారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా తాగునీటి పథకం ఏర్పాటుకు నిధులు మంజూరైనట్టు చెప్పారు. శనివారం నుంచి పథకం నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని ఆయన తెలిపారు. ఇది పూర్తయితే శింగవరానికి తాగునీటి సమస్య తీరుతుందన్నారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

కొయ్యూరు, ఫిబ్రవరి 17: శింగవరం గ్రామంలో షిర్డీ సాయిబాబా ఆలయ 19వ వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో ప్రభాతసేవ, అనంతరం బాబాకు అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం శింగవరం గ్రామానికి చెందిన ఆంధ్ర గణేష్, లక్ష్మి దంపతుల ఆర్థిక సాయంతో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

బోడిదొరకు మెరుగైన వైద్యం అందించాలి

జి.మాడుగుల, ఫిబ్రవరి 17: స్వాతంత్ర్య సమర యోధుడు మల్లుదొర మనువడు బోడిదొరకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జడ్పీటీసీ సభ్యురాలు మత్స్యరాస వెంటకలక్ష్మి కోరారు. కేజీహెచ్‌లో వైద్య సేవలు పొందుతున్న బోడిదొరను శనివారం పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని కేజీహెచ్ సూపరింటెండెంట్‌ను కోరినట్టు ఆమె చెప్పారు. ఆమె వెంట మాజీ ఎంపీపీ ఎం.వెంకటగంగరాజు తదితరులు ఉన్నారు.

వారపు సంతలో పోలీసు తనిఖీలు

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 17: మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంతలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఎస్ఐ కె.రవీంద్ర ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్, ఏపీఎస్పీ పోలీసులు ఉదయం నుంచి సాయంత్రం వరకు గస్తీ నిర్వహించారు. వాహనాలను, ప్రయాణికుల లగేజీలను తనిఖీలు చేశారు. నాలుగు రోడ్ల కూడలి వద్ద అడ్డదిడ్డంగా నిలిపిఉన్న వాహనాలను దగ్గరుండి తీయించారు. ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు చేపట్టారు. సంత రోజు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అందరూ సహకరించాలని ఎస్ఐ కోరారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా అరుణ్‌కుమార్

గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 17: మండల ప్రాథమిక వ్యవసాయ కోపరేటివ్ సొసైటీ (పీఏసీఎస్) చైర్మన్‌గా వంతల అరుణ్‌కుమార్ నియమితులయ్యారు. ఏడాదిపాటు పీఏసీఎస్ చైర్మన్‌గా వసుపరి ప్రసాద్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అతని స్థానంలో తాజాగా అరుణ్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఎంపీపీ బోయిన కుమారి, జడ్పీటీసీ సభ్యురాలు శివరత్నం, సర్పంచ్ నడిగెట్ల రాజు, ఎంపీటీసీ సభ్యురాలు నాగమణి తదితరులు అరుణ్‌కుమార్‌ను సత్కరించారు.

విద్యుదాఘాతంతో యువకుడికి తీవ్ర అస్వస్థత

గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 17: మండలంలోని మొండిగెడ్డ పంచాయతీ గాలిమాను గ్రామంలో విద్యుదాఘాతానికి గురైన ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గాలిమాను గ్రామానికి చెందిన గిరిజన యువకుడు గబులంగి తెల్లన్నకు విద్యుత్ పనులపై అవగాహన ఉంది. గ్రామంలోని సింగల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఫీజ్ తెగిపోవడంతో తెల్లన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి ఫీజ్ కలిపే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో బాధితుడు చేతి, కడుపు భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని కుటుంబ సభ్యులు వెంటనే ప్రైవేటు వాహనంలో చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితుడు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నాడు.